నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంచిర్యాల, శుక్రవారం 5 ఏప్రిల్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

7న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి

మందమర్రి రూరల్, మార్చి 4 : మందమర్రి మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో ఆరు నుంచి పదో తరగతుల్లో ప్రవేశం కోసం ఈ నెల 7న పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కార్మెల్ స్కూల్, సింగరేణి పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఆరో తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు,7 నుంచి పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల దాకా పరీక్ష ఉంటుందని తెలిపారు. ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ telanganams.cgg.gov.in వెబ్ సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు.

భగీరథ నీళ్లు వృథా..

చింతలమానేపల్లి, ఏప్రిల్ 4 : మండలంలోని డబ్బా-బారెగూడ గ్రామాల మధ్య కౌటాల-బెజ్జూర్ ప్రధాన రహదారి పక్కన మిషన్ భగీరథ పైప్‌లైన్ గురువారం పగిలిపోవడంతో నీరంతా పక్కనే ఉన్న ధరంపల్లి వాగులోకి వృథాగా పోతున్నది. అసలే ఎండ కాలం.. తాగు నీటికి పడరాని పాట్లు పడుతుంటే.. ఇలా నీటిని వృథా చేయడమేమిటని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతు చేసి తాగు నీటిని సక్రమంగా సరఫరా చేయాలని కోరుతున్నారు.

వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీళ్లు

తాత్కాలిక కట్టడాలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

తాత్కాలిక కట్టడాల తొలగింపు సరే..

బహుళ అంతస్తుల సంగతేంటి?

బెల్లంపల్లి మున్సిపాలిటీలో అధికారుల పక్షపాత వైఖరి

- చిరువ్యాపారులు, పేదలపై ఉక్కుపాదం
- బడాబాబుల భవంతుల జోలికెళ్లని వైనం
- రాజకీయ ఒత్తిళ్లతో ఆక్రమణల తొలగింపునకు స్వస్తి
- బల్దియా ఆదాయానికి భారీగా గండి

బజార్ ఏరియాలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న భవనం

బెల్లంపల్లి, ఏప్రిల్ 4 : బెల్లంపల్లి బల్దియాలో అధికారులు పక్షపాత వైఖరి ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందన్న సాకుతో రోడ్డు పక్కనున్న తోపుడుబండ్లు, చిన్న దుకాణాలను తొలగించిన మున్సిపల్ సిబ్బంది, నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తులను మాత్ర పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతనెల 19న పట్టణంలోని బజార్ ఏరియాలో కాంటా చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ స్థలాలు, మురుగు కాలువలపై ఏర్పాటు చేసి దుకాణాలు, తోపుడు బండ్లు, ఇతర సామగ్రిని మున్సిపల్ అధికారులు తొలగించిన విషయం విదితమే. కలెక్టర్ ఆదేశాలతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న నిర్మాణాలు తొలగిస్తున్నామని చెప్పిన మున్సిపల్ అధికారులు, ఆ ఒక్కరోజుతోనే సరిపెట్టారు. అదే రోజు మధ్యాహ్నం వరకు తొలగించి, లంచ్ బ్రేక్ తర్వాత స్వస్తి చెప్పారని పట్టణ ప్రజలు మాట్లాడుకుంటున్నారు. ఆ వైపు బడాబాబుల దుకాణాలు, భవంతులు ఉన్నాయనే ఉద్దేశంతోనే తొలగించలేదని జోరుగా ప్రచారం సాగుతున్నది. ఇది నిరంతర ప్రక్రియ అని ప్రకటించిన కమిషనర్ ఆ రోజు నుంచి ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తున్నది. చిరు వ్యాపారులపై ఉక్కుపాదం మోపుతున్న అధికారులు బడా వ్యాపారుల జోలికి ఎందుకు వెళ్లడంలేదని ప్రజలు మండిపడుతున్నారు.

మున్సిపల్ ఆదాయానికి గండి..

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో 34 వార్డులు ఉన్నాయి. ఇందులో కాల్‌టాక్స్ ఏరియాలోని రెండు వార్డుల్లో మాత్రమే ఇళ్లు, భవనాల నిర్మాణానికి మున్సిపల్ అనుమతులు ఉన్నాయి. మిగతా వార్డులు సింగరేణి ఆధీనంలో ఉండగా, ప్రస్తుతం రెవెన్యూకు అప్పగించింది. ఆయా ప్రాంతాల్లో ఉన్న ఇళ్లకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు లేవు. ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలంటే సంబంధిత ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి. ఈ నిబంధన మున్సిపల్ అధికారులు, వార్డు ప్రజాప్రతినిధులకు వరంలా మారింది. ఇళ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిస్తే స్థానిక ప్రజాప్రతినిధి మున్సిపల్ అధికారులకు సమాచారం ఇస్తాడు.. ఆపై ఆ నిర్మాణాన్ని అడ్డుకుంటారు.. దీంతో సదరు యజమాని ప్రజాప్రతినిధిని మచ్చిక చేసుకుంటే నిర్మాణం చేసుకోవచ్చు.. లేదంటే ప్రతిరోజూ మున్సిపల్ సిబ్బంది నిర్మాణాన్ని అడ్డుకుంటూ పనిముట్లను స్వాధీనం చేసుకుంటారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. రూ. లక్షలతో పనులు ప్రారంభించిన యజమాని ఇక చేసేదేమీ లేక ప్రజాప్రతినిధిని కలిసి గుడ్‌విల్ చెల్లించుకుంటారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే ఈ విధంగా అనేక భవనాలు అనుమతులు లేకుండా వెలిశాయి. అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోకపోవడం, మధ్యవర్తులకు నజరానాలు చెల్లించడంతో మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఒక్కో వార్డులో ఫిల్లర్‌కు రూ. 10 వేల నుంచి రూ. 25 వేల వరకు లావాదేవీలు నడుస్తున్నాయని ప్రచారం జరుగుతోంది. బెల్లంపల్లిలో ఎక్కడైనా నిరుపేద వ్యక్తి చిన్న ఇల్లు కట్టుకునేందుకు ప్రయత్నిస్తే వారిపై ఉక్కుపాదం మోపే మున్సిపల్ అధికారులకు.. బహుళ అంతస్తులు కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉన్న ఇంటిని, దుకాణాన్ని కూల్చి వేసి బహుళ అంతస్తు నిర్మించుకున్న యజమాని మాత్రం ఆస్తిపన్ను.. ఆ చిన్న ఇల్లు, దుకాణం పేరిటే చెల్లిస్తుండడంతో యేటా లక్షల్లో ఆదాయం కోల్పోవాల్సి వస్తున్నది. సదరు మున్సిపల్ సిబ్బంది యజమానులతో లోపాయికారి ఒప్పందం చేసుకొని మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పండ్ల దుకాణం తొలగించిన్రు..

పట్టణంలో పార్కింగ్ సమస్య ఉందని అధికారులు నా పండ్ల దుకాణాన్ని తొలగించిన్రు. తోపుడు బండిపై ఉన్న తడకలు మున్సిపల్ కార్యాలయానికి తీసుకపోయిన్రు. పండ్ల వ్యాపారంపై బతికే మాపై అధికారులు ప్రతాపం చూపిస్తున్నరు. కమిషనర్లు కొత్తగా వచ్చినప్పుడు మా లాంటి పేద్దోళ్ల తాత్కాలిక దుకాణాలను తొలగిస్తరు. బడాబాబుల దుకాణాల వైపు మాత్రం కన్నెత్తి చూడరు. కాంటా చౌరస్తా నుంచి బజార్ ఏరియా వరకు కొన్ని దుకాణాలను మాత్రమే తొలగించిన్రు. పెద్దోళ్ల దుకాణాల జోలికి మాత్రం పోలేదు. ఇక్కడంతా పలుకుబడి ఉన్నోళ్లదే నడుస్తోంది. **- అబ్బాస్**

ఎన్నికల తర్వాత తొలగిస్తాం..

బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా నుంచి బజార్ ఏరియా వరకు పార్కింగ్ స్థలాల్లో ఉన్న అక్రమ నిర్మాణాల తొలగింపునకు శ్రీకారం చుట్టాం. ఇటీవల రోడ్డుపై నడవడానికి స్థలం లేక ఓ అమ్మాయికి ప్రమాదం జరిగింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని తలపెట్టాం. పార్లమెంట్ ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్నందున ఈ ప్రక్రియపై దృష్టి పెట్టలేకపోతున్నాం. రోడ్ల పై ఎవ్వరూ తోపుడు బండ్లు పెట్టకూడదు. ప్రమాదాలు జరిగితే బాధ్యులు అవుతారు. ఎన్నికల ప్రక్రియ ముగియగానే తొలగింపు ప్రక్రియ ప్రారంభిస్తాం. **- గోపు మల్లారెడ్డి, మున్సిపల్ కమిషనర్**

గజగజ

ప్రజలను వణికిస్తున్న ఏనుగు

24 గంటల్లో ఇద్దరిని బలి తీసుకున్న వైనం

- బూరెపల్లి ఘటన మరవకముందే.. కొండపల్లిలో మరో రైతుపై దాడి
- పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్తున్న పోశన్నను చంపిన గజేంద్రుడు
- న్యాయం చేయాలంటూ మృతదేహం వద్ద మూడు గంటల పాటు ఆందోళన
- అదనపు కలెక్టర్ హామీతో వెనక్కి తగ్గిన బంధువులు
- ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

పోశన్న(ఫైల్)

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/పెంచికల్‌పేట్, ఏప్రిల్ 4 : మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నదిని దాటి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోకి ప్రవేశించిన ఓ ఏనుగు ప్రజలను వణికిస్తున్నది. 24 గంటల్లో ఇద్దరిని బలి తీసుకోగా, ఎప్పుడు ఏ వైపు నుంచి వచ్చి దాడి చేస్తుందోనన్న భయం వెంటాడుతుంది. బుధవారం మధ్యాహ్నం చింతలమానేపల్లి మండలం బూరెపల్లి సమీపంలో మిరపకాయలు ఏరుతున్న అల్లూరి శంకర్(55)ను తొండంతో కొట్టి చంపగా, గురువారం తెల్లవారు జామున పెంచికల్‌పేట్ మండలం కొండపల్లికి చెందిన మరో రైతు కారు పోశన్న(65)ను తొక్కి అంతమొందించింది.

పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి..

కొండపల్లికి చెందిన కారు పోశన్నకు గ్రామ శివారులో రెండెకరాల పొలం ఉంది. గురువారం ఉదయం 5 గంటలకు నీళ్లు పెట్టేందుకు బయలుదేరాడు. చెట్ల పొదల మాటు నుంచి వచ్చిన ఏనుగు ఒక్కసారిగా అతడిపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అదే సమయంలో మార్నింగ్ వాక్‌కు వెళ్లిన మాజీ సర్పంచ్ సుధాకర్ ఈ ఘటన చూసి కేకలు వేస్తూ గ్రామంలోకి పరిగెత్తాడు. గ్రామస్తులు, మృతుడి కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య సుశీల, ఇద్దరు కుమారులు భీమేష్, అంజన్న, కూతురు సునీత ఉన్నారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ కరుణాకర్, సీఐ అల్లం రాంబాబు, ఎస్ఐ కొమురయ్య , ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో సుధాకర్ బృందం అక్కడ విచారణ జరిపారు.

ఏనుగు పాదముద్రలను ట్రాక్ చేస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

మృతదేహం వద్ద ఆందోళన

పోశన్న మృతదేహం వద్ద కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, అప్పటి దాకా మృతదేహాన్ని తరలించనివ్వబోమంటూ దాదాపు మూడు గంటల పాటు అక్కడే కూర్చున్నారు. అదనపు కలెక్టర్ వేణు అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎక్స్‌గ్రేషియాను త్వరలో అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చనిపోయిన రైతు కుటుంబ సభ్యులు కోరిన విధంగా బాధిత కుటుంబానికి సర్వేనంబర్ 119లోని ఐదు ఎకరాల భూమికి పట్టా అందిస్తామని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని అదనపు కలెక్టర్ భరోసా ఇచ్చారు. రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని ఒప్పంద పత్రంలో ఆయనతో సంతకం చేయించుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. ఆపై గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏనుగు సంచరిస్తున్న మండలాల పరిధిలో 144 సెక్షన్ విధించారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే..

మహారాష్ట్ర నుంచి వచ్చిన ఏనుగు బుధవారం ఓ రైతును పొట్టనబెట్టుకున్న ఘటన మరవక ముందే మరో రైతును బలి తీసుకోవడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫారెస్ట్ అధికారులకు ముందస్తు సమాచార మున్నా పట్టించుకోకపోవడం వల్లే ఇద్దరు బలి కావాల్సి వచ్చిందని, ఇప్పటి వరకు ఆ ఏనుగు ఎక్కడుందో తెలుసుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడుతున్నారు. ఎప్పుడు ఏ వైపు నుంచి వచ్చి దాడి చేస్తుందోనని భయం భయంగా గడుపుతున్నామని, ఇకనైనా అధికారులు స్పందించి దానిని పట్టుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏనుగు జాడ కోసంయత్నిస్తున్నాం
- ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 4 : జిల్లాలోకి వచ్చిన ఏనుగు ఇద్దరి మృతికి కారణమైంది. చింతలమానేపల్లి, పెంచికల్‌పెట్, దహెగాం, బెజ్జూర్ మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఒంటరిగా పొలాల వైపు వెళ్లకూడదు. అటవీశాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక బృందాల ద్వారా ఏనుగు జాడ కోసం ప్రయత్నిస్తున్నాం.

బెజ్జూర్ : చిన్నసిద్ధాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఏనుగు జాడ తెలుసుకునేందుకు యత్నిస్తున్నాం
- విలేకరుల సమావేశంలో పీసీసీఎఫ్ పర్‌గెయిన్

బెజ్జూర్, ఏప్రిల్ 4 : ఏనుగు సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని పీసీసీఎఫ్ పర్‌గెయిన్ అన్నారు. గురువారం బెజ్జూర్‌లోని అటవీ శాఖ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శాంతారాంతో కలిసి మాట్లాడారు. సాధారణంగా ఏనుగులు గుంపులుగా జీవిస్తాయని, ఓ గజరాజు పొరపాటున దారి తప్పి తెలంగాణ ప్రాంతానికి వచ్చిందని, దాని ప్రవర్తన అసాధారణంగా మారిందన్నారు. అది ఇద్దరు రైతులను హతమార్చడం బాధాకరమని తెలిపారు. తెలంగాణ అడవుల్లోకి మొట్ట మొదటిసారిగా రావడంతోనే విచిత్రంగా ప్రవర్తిస్తుందని చెప్పారు. ప్రజలు, రైతులు బయటకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆయా గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి డప్పు చాటింపులు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఏనుగుకు కావాల్సిన ఆహారం లేదని, అది ఎక్కువ కాలం ఈ ప్రాంతంలో ఉండదని వివరించారు. ప్రజలు ఎలాంటి ఆందోళనలు చేయకుండా సహకరిస్తే దాని దారిన అది వెళ్లిపోతుందని, లేదంటే పటాకులు పేల్చి దానిని తిరిగి మహారాష్ట్రకు పంపిస్తామని చెప్పుకొచ్చారు. మహారాష్ట్ర నుంచి ఏనుగును అదుపు చేసే నిపుణుల బృందాన్ని పిలిపించామని, దాని ఆచూకీ తెలుసుకోవడానికి డ్రోన్‌లు వాడబోతున్నామన్నారు. రాత్రిళ్లు కూడా థర్మల్ డ్రోన్లతో ఏనుగు జాడ తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రీవాల్, ఎఫ్ఆర్వో దయాకర్, డీఆర్‌వో శ్రావణ్ ఉన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న సీఎఫ్ శాంతారాం

మహిళ ల రక్షణకే షీటీంలు

సీపీ కాఫీ విత్ షీటీం మెంబర్స్‌లో శ్రీనివాస్

షీ టీం బృందంతో కాఫీ తాగుతున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 4: మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలున్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చునని, మహిళల రక్షణ కోసమే షీ టీంలు పనిచేస్తున్నాయని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ తెలిపారు. గురువారం రామగుండం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ కాఫీ విత్ షీ టీం మెంబర్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు, చిన్న పిల్లల రక్షణ విషయంలో రామగుండం కమిషనరేట్ పోలీస్ శాఖ పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మహిళలను, విద్యార్థినులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డయల్ 100, షీ టీం వాట్సప్ నంబర్ 6303923700లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ వేదికల మీదుగా కూడా ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ యేడాది 205 అవగాహన సదస్సులు, 690 హాట్ స్పాట్స్ విజిట్ నిర్వహించామన్నారు. 10వ తరగతి, ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తున్న 22 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని, వారి వద్ద 10 బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇందులో 13 మంది మైనర్లు ఉండగా, వారి తల్లితండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించామని పేర్కొన్నారు. అనంతరం షీ టీం సభ్యులను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలోమంచిర్యాల షీ టీం ఎస్ఐ హైమా, సభ్యులు పాల్గొన్నారు.

ఫైర్‌సేఫ్టీ తనిఖీ తప్పనిసరిగా నిర్వహించాలి : రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 4 : జిల్లాలో ఫైర్ సేఫ్టీ తనిఖీలు ఎప్పటికప్పుడు తప్పనిసరిగా నిర్వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం రామగుండం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో మంచిర్యాల జిల్లా పరిధిలోని ఫైర్ శాఖ అధికారులు, సింగరేణి, ఏన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, వివిధ పరిశ్రమల ఫైర్ సేఫ్టీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అగ్ని జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదంపై సమాచారం తెలిసిన వెంటనే పరిధితో సంబంధం లేకుండా సిబ్బంది స్పందించాలన్నారు. భారీ భవనాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు, హాస్పిటళ్లు, పాఠశాలలు, అపార్ట్‌మెంట్లలో తనిఖీలు చేయాలని సూచించారు. అపార్ట్‌మెంట్‌లలో, ఇండ్లలో ఉన్న స్థలాలకు అనుగుణంగా ఫైర్ రెసిస్టెన్స్ పరికరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిబంధనలు పాటించని వ్యాపార, వాణిజ్య సంస్థలపై ప్రత్యేక చర్యలు తీసుకొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మంచిర్యాల జిల్లా ఫైర్ ఆఫీసర్ అజయ్‌కుమార్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ దేవేందర్, బెల్లంపల్లి ఫైర్ స్టేషన్ ఆఫీసర్ అనిల్ కుమార్, జైపూర్ ఎస్‌టీపీపీ ఆఫీసర్లు సురేశ్, రమేశ్‌కుమార్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా తాగునీరందించాలి

మాట్లాడుతున్న ప్రత్యేక కార్యదర్శి, కార్మిక శాఖ సంచాలకులు కృష్ణాదిత్య

నస్పూర్/ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 4 : వేసవి పూర్తయ్యే దాకా ప్రణాళికాబద్ధంగా తాగు నీరందించాలని ప్రత్యేక కార్యదర్శి, కార్మిక శాఖ సంచాలకుడు కృష్ణాదిత్య అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు బదావత్ సంతోష్, వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్లు రాహుల్, దీపక్ తివారీతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా ఇంటింటికీ అందుతున్న తాగునీటి సరఫరా ప్రక్రియ పరిశీలించాలని, ఇబ్బందులుంటే తగు చర్యలు చేపట్టాలన్నారు. జన్నారం మండలానికి కడెం ప్రాజెక్టులో అందుబాటులో ఉన్న 23 టీఎంసీల నీటి నుంచి సరఫరా చేయాల్సి ఉందన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా అవుతున్న నీటిపై ప్రతిరోజూ నివేదిక అందించాలన్నారు. బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలోని 7 మండలాలకు 1.8 టీఎంసీల నీరు అవసరముండగా, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని అడ ప్రాజెక్టు నుంచి సరఫరా చేయాలన్నారు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం, హెచ్చుతగ్గులు లేకుండా చూడాలన్నారు. పల్లెల్లోని బోర్‌వెల్‌లు, మిషన్ భగీరథ నల్లా కనెక్షన్‌ల ద్వారా రోజూ నీటి సరఫరా చేయాలని తెలిపారు. నీటిని సరఫరా చేయలేని ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ మార్గాలు, వాటర్ ట్యాంకర్ల ద్వారా అందించాలని సూచించారు. వచ్చే మూడు నెలలు ఇంటింటికీ నీరందించేలా చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అవసరమున్న ప్రాంతాల్లో బోర్‌వెల్‌లు అద్దెకు తీసుకుని నీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నామన్నారు. మంచిర్యాల జిల్లా పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని అడ ప్రాజెక్టు, నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుల ద్వారా తాగునీరు సరఫరా అవుతుందని తెలిపారు. 16 మండలాల్లోని 640 మారుమూల గ్రామాలకుగాను 637 గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా నీటిని అందించడం జరుగుతుందన్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలు, 10 మండలాలకు ప్రతి రోజూ నీటిని సరఫరా చేయాలని, తిర్యాణి, లింగాపూర్ , సిర్పూర్ (యు) మండలాలలో తాగునీటిని అందించేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించాలని కృష్ణాదిత్య తెలిపారు.కలెక్టర్ వెంకటేశ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వేసవికాలంలో తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 4 : ఉగాది-2024 పురస్కారాల ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఈఎస్ఎస్ నారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి కవులు, కళాకారులు, రచయితలు, విద్యావంతులు, క్రీడాకారులు, కర్షకులు, కార్మికులు, ఉపాధ్యాయులు, మేధావులు, వైద్యులు, సామాజిక సేవకులు, యోగా గురువుల ప్రతిభ, సేవలను గుర్తించి సన్మానిస్తామని పేర్కొన్నారు. ఏప్రిల్ 10లోగా సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్, గతంలో పొందిన పురస్కారాల సర్టిఫికెట్ల ఫొటోలు జతచేసి డోర్ నంబర్ 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, తిరుమలగిరి, సికింద్రాబాద్ అడ్రస్‌కు పంపించాలని కోరారు. మరిన్ని వివరాలకు నం.3952347207లో సంప్రదించాలని కోరారు.

అంతర్రాష్ట్ర నకిలీ వీసా ముఠా అరెస్టు

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 4 : అమాయకులు, నిరుద్యోగులను ఆసరా చేసుకుని విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నకిలీ వీసాలు సృష్టించి మోసం చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన సీసాన రాజేశ్‌కుమార్, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన పెగ్గర్ల చంద్రశేఖర్‌లు ఇద్దరు స్నేహితులు. వీరిద్దరు కూడా కరీంనగర్‌లోని రేకుర్తిలో గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. వీరి గది పక్కనే నిర్మల్ జిల్లా సోన్, నిర్మల్, సారంగాపూర్ యువకులు కూడా కిరాయికి ఉంటున్నారు. ఈ ముగ్గురు యువకులు ఉద్యోగ వేటలో ఉండగా.. రాజేశ్‌కుమార్, చంద్రశేఖర్ చాయ్ హోటల్‌లో పరిచయం అయ్యారు. మేము ఆర్మీ ఆఫీసర్స్‌మని నకిలీ స్టాంప్స్ తయారు చేసుకుని ఈ యువకులను విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మ బలికారు. ఈ ముగ్గురు యువకులు ఇంటికి వచ్చినా తరచూ ఫోన్ చేస్తూ ఉండేవారు. వీసా కోసమని రూ.2.65 లక్షలు ఫోన్ పే చేయించుకున్నారు. కడ్తాల్ యువకుని నుంచి రూ.1.25 లక్షలు, నిర్మల్ యువకుని నుంచి రూ.70 వేలు, అలూర్ యువకుని నుంచి రూ.70 వేలు తీసుకుని ఫేక్ వీసాలు పంపించారు. బాధితులు మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం సోన్‌లో రాజేశ్‌కుమార్, చంద్రశేఖర్‌లను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 11 సిమ్ కార్డులు, ఆర్మీ డ్రెస్, బ్యాంకు పాస్ బుక్‌లు, చెక్ బుక్‌లు, రూ.2,500 నగదు, మొబైల్ ఫోన్, ప్రామిసరీ నోట్, ఫోర్జరీ వీసా జిరాక్స్ కాపీలను స్వాధీనం చేసుకున్నారు.